
సాక్షి అనంతపురం

శుక్రవారం । 7 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.24,500

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,500 ధర పలికాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.5 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

అబ్బేదొడ్డిలో చిరుత కలకలం



చిరుత పాదముద్ర

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం సృష్టించింది. మూడు నెలలుగా సమీప అటవీ ప్రాంతం నుంచి గ్రామ శివారులోని రిజర్వాయర్ వద్దకు వస్తూ రైతులు, గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు రోజుల క్రితం గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి ప్రయాణికులతో ఆటో వెళ్తుండగా రెండు చిరుతలు రోడ్డు దాటుతూ కనిపించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గురువారం వేకువజామున మాముడూరు గ్రామానికి వెళ్లే దారిలో చిరుత కనిపించింది. రైతులు ఓ చెట్టు పక్కన దాక్కొని ప్రాణాలు కాపాడుకున్నారు. చిరుత పాదముద్రల ఫొటోలు తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- ఉద్యాన అధికారి నరసింహారావు



శిరివరంలో చీనీ పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి నరసింహారావు

గార్లదిన్నె: చీనీ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కొప్పల కొండ, శిరివరంలో చీనీ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్ట పరిస్థితుల వల్ల తోటల్లో వేరుకుళ్లు, బంక తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 'బెట్ట' పెరిగే కొద్దీ వ్యాధి ఉధృతి ఎక్కువవుతుందన్నారు. వ్యాధి నివారణకు ట్రైకోడెర్మా, సుడోమనాస్ వంటి శిలీంధ్ర నాశకాలు, పశువుల ఎరువుతో కలిపి చెట్లకు అందించాలన్నారు. సూక్ష్మ పోషకధాతు లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్బెండిజం మందు ఒక గ్రాముకు లీటర్ నీటికి కలిపి పాది మొత్తం తడిసేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాప్తాడు ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, శ్రీనివాసులు, గ్రామ ఉద్యానశాఖ అధికారులు గంపరాజు, మల్లికార్జున రైతులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో ఉన్న ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలుర పాఠశాలలో (ఏపీఆర్‌ఎస్‌ఓఈ) ప్రవేశానికి 2025–26 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యా సంస్థల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు ఉన్నాయన్నారు. రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలురు అర్హులన్నారు. ఏపీఆర్‌ఎస్ క్యాట్ (ఏపీఆర్‌ఎస్ సీఏటీ) అర్హత పరీక్ష ద్వారా ప్రవేశం పొందవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు https://aprs. apcfss.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31 వరకూ గడువు విధించామన్నారు.అదేవిధంగా ఏప్రిల్ 25న జరిగే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారి మార్కుల ఆధారంగా ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 87126 25065 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

తిరుపతి రైలు తిరిగేలా లేదప్పా!

రాయదుర్గంటౌన్: ఇప్పట్లో రాయదుర్గం ప్రాంత ప్రజలకు కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దాదాపు ఏడాది నుంచి ఈ ప్యాసింజర్‌ను రైల్వే అధికారులు పాక్షికంగా రద్దు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే మరోసారి కదిరిదేవరపల్లి–తిరుపతి మధ్య రాకపోకలు సాగించే రైలు (57405/57406) రద్దును ఈ నెలాఖరు వరకూ పొడిగించారు. ఈ మేరకు సౌత్ వెస్టర్న్ రైల్వే పీఆర్‌ఓ మంజునాథ కనమడి ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం–తుమకూరు మార్గంలో ట్రాక్ పనులు పూర్తయిన కదిరిదేవరపల్లి వరకు నడుపుతున్న ఏకైక రైలును సైతం రద్దు చేస్తూ వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోతల రేషన్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదలకు కష్టాలు ఒకదాని వెంట ఒకటి నీడలా వెన్నంటి వస్తున్నాయి. 'సూపర్ సిక్స్' హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు... పథకాలు అమలు అటుంచి ఉన్న వాటికి కూడా కోతలు పెడుతున్నారు. తాజాగా రేషన్ సరుకుల్లో కోత పెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అనంతపురం మారుతీనగర్‌లో రేషన్ సరుకుల కోసం క్యూలో నిల్చున్న కార్డుదారులు (ఫైల్)

- కందిపప్పు కోటా సరఫరా చేయని చంద్రబాబు ప్రభుత్వం
- బియ్యం, చక్కెరతో సరిపెడుతున్న వైనం
- అరకొర సరుకులు తీసుకునేందుకూ పేదల పడిగాపులు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు

అనంతపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా 6,60,330 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డులోని ఒక్కో సభ్యునికి ప్రతి నెలా 5 కిలోల చొప్పున బియ్యం, కార్డుకు అరకిలో చక్కెర, కిలో కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే, మార్చి నెలకు సంబంధించి కందిపప్పు కోటా 625 టన్నులను ప్రభుత్వం సరఫరా చేయలేదు. కార్డుదారులకు కేవలం బియ్యం, చక్కెర పంపిణీతో సరిపెడుతున్నారు. గత రెండు నెలలు కూడా కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయలేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. ఇక .. అరకొర సరుకులు తీసుకునేందుకూ చౌక దుకాణాల వద్ద బారులు తీరి గంటల పాటు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొనడంతో కార్డుదారులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

బియ్యం నొక్కుడు..

కొందరు డీలర్లు కార్డుదారులకు ఇవ్వాల్సిన కోటా నుంచి బియ్యం నొక్కేస్తున్నారు. కార్డుకు మూడు కిలోల బియ్యం బదులు జొన్నలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కార్డుదారులు జొన్నలు తీసుకున్నా.. తీసుకోకపోయినా బియ్యం మాత్రం మూడు కిలోలు ఇవ్వడం లేదు. ఇలా మిగుల్చుకున్న బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేసే వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

షాపుల వద్ద బారులు..

ఒక ఎండీయూ (బియ్యం పంపిణీ వాహనం) నిర్వాహకుని వద్ద ఈ–పాస్ యంత్రం ఉంటుంది. ఎండీయూ పరిధిలో మూడు నుంచి నాలుగు స్టోర్లు వస్తాయి. దీంతో అన్ని స్టోర్లలో ఒకేసారి సరుకుల పంపిణీకి వీలుకాకపోవడంతో మూడు రోజులు ఒక స్టోర్ వద్ద ఈ–పాస్ యంత్రం పెట్టుకుని దాని డీలర్ ద్వారా రేషన్ ఇస్తున్నాడు. అటు తరువాత మరో స్టోర్ వద్ద.. ఇలా మూడు రోజులకు ఒక్కో స్టోర్ వద్ద సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో తెరిచిన స్టోర్ వద్దకు కార్డుదారులు పెద్దసంఖ్యలో చేరుకుని సరుకులు తీసుకునేందుకు బారులు తీరుతూ అవస్థలు పడుతున్నారు.

అమలు కాని ప్రభుత్వ విధానం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు ఇవ్వాలి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలి. స్టోర్ డీలర్ రిజిస్టర్ నిర్వహించాలి. అయితే జిల్లాలో ఈ విధానం అమలు కావడం లేదు. ప్రతి రేషన్ షాపు డీలర్‌కు ఒక ఈ–పాస్ యంత్రాన్ని ప్రభుత్వం ఇవ్వకపోవడంతో సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

జిల్లాలో చౌకదుకాణాలు	1,645
మొత్తం బియ్యం కార్డులు	6,60,330
తెల్లకార్డులు	6,07,959
ఏఏవై కార్డులు	52,371
కార్డుల్లో సభ్యులు	19,51,754
పురుషులు	9,71,251
మహిళలు	9,80,503
ఇవ్వాల్సిన కందిపప్పు కోటా	625 టన్నులు

కందిపప్పు ఇవ్వలేదు



రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు ఇవ్వడం లేదు. ఎందుకని అడిగితే సరఫరా కాలేదని చెబుతున్నారు. గత నెల కూడా కందిపప్పు ఇవ్వలేదు. సరుకులు తీసుకునేందుకు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది.

– హేమలత, మారుతీ నగర్, అనంతపురం

చాలా ఇబ్బందిగా ఉంది..



సరుకులు తీసుకునేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. పనులు విడిచిపెట్టుకుని గంటల కొద్దీ స్టోరు వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయినా, అన్ని సరుకులు ఇస్తారా అంటే అదీ లేదు. ఇది చాలా అన్యాయం.

– అంజన్‌బాబు, అనంతపురం

కందిపప్పు కోటా రాలేదు



జిల్లాకు సంబంధించి ఈ నెల కందిపప్పు కోటా రాలేదు. దీంతో కార్డుదారులకు కందిపప్పు పంపిణీ జరగలేదు. బియ్యం, చక్కెర ఎలాంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేస్తున్నాం. జొన్నలకు డిమాండ్ ఉన్న చోట్ల అందజేస్తున్నాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

'ఉపాధిలో అక్రమాలు.. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

- మరొకరికి షోకాజ్



అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. మరొకరికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆత్మకూరు మండలం రంగంపేట గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుశీలమ్మ ఉపాధి పనులు చేపట్టకుండానే కూలీలను మస్టర్లలో నమోదు చేయడంతోపాటు పాత పనులు చేస్తున్న కూలీల ఫొటోలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. అలాగే, రాప్తాడు మండలంలోని గొల్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య రెండేళ్ల క్రితం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను తాజాగా చేసినట్లు మస్టర్లలో నమోదు చేశారు. 32 మంది కూలీలు పనులకు హాజరు కాగా ఏకంగా 62 మంది ఉన్నట్లు చూపారు. ఈ విషయాలపై అనుమానం వచ్చిన సాంకేతిక నిపుణులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా అక్రమాలు బట్టబయలయ్యాయి. దీంతో అధికార యంత్రాంగం ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేసింది.

తోపుదుర్తి ఫీల్డ్ అసిస్టెంట్‌ను కాపాడేందుకు యత్నాలు..

ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్‌నాయుడు సైతం గ్రామంలో ఎలాంటి పనులు చేపట్టకుండానే పాత ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు మస్టర్లను సైతం నమోదు చేసి బిల్లుల కోసం పంపినట్లు తెలిసింది. అయితే సురేష్‌ను కాపాడేందుకు పలువురు టీడీపీ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో షోకాజ్ నోటీసుతో సరిపెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి ఉపాధి పనుల్లో అక్రమాలకు అధికార యంత్రాంగం సైతం 'పచ్చ'జెండా ఊపుతున్నట్లు అర్థమవుతోంది.

కర్మచారీ వ్యవస్థను నిర్మూలించాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'సఫాయి కర్మచారీ (మాన్యువల్ స్కావెంజర్) వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతో పాటు రుణాలు మంజూరు చేయాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న అన్ని మునిసిపాలిటీల్లో మహిళా పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా విజిలెన్స్ కమిటీ (మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం– 2013) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్‌హోల్స్‌లో మనుషులతో పనిచేయించడం సరికాదని, ఇలా పనిచేయించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, రేడియం జాకెట్, గ్లౌజులు, యూనిఫాం, కొబ్బరినూనె, గమ్‌బూట్లు, పనిముట్లు ఇవ్వాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న కర్మచారీలకు రుణాలు, శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెలకోసారి హెల్త్ క్యాంపు నిర్వహించి పారిశుధ్య కార్మికులతో పాటు కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రాధిక, నగర పాలక కమిషనర్ బాలస్వామి, డ్వామా పీడీ సలీమ్‌బాషా, హౌసింగ్ పీడీ శైలజ, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, పీఆర్‌ఎస్‌ఈ జహీర్ అస్లాం, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, గిరిజన సంక్షేమాధికారి రామాంజినేయులు, సభ్యులు పెన్నోబుళేసు, వినోద్‌కుమార్, రియాజ్ బాషా, పద్మావతి, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా మహిళా దినోత్సవ ఏర్పాట్లు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం తన చాంబర్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఐసీడీఎస్, మెప్మా, డీఆర్‌డీఏ, పోలీసు, సమగ్రశిక్ష తదితర శాఖల పరిధిలోని మహిళలకు అందిస్తున్న లక్‌పతి దీదీ, లైవ్లీ హుడ్ యూనిట్లు, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ కింద యూనిట్లు, రుణాల మంజూరు, గ్రౌండింగ్ చేయాలన్నారు. మెప్మా, ప్రేరణ సఖీ, శక్తియాప్, అనంత ఆత్మరక్షణ, 112 కాల్ సెంటర్, తదితర అన్ని రకాల స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ మలోల, ఎఫ్‌ఎస్‌ఓ రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్.. వసూళ్లు ఫుల్!

- పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో వసూళ్ల పర్వం
- టార్గెట్లు విధించి మరీ లాగుతున్న ఓ డీఈ స్థాయి అధికారి
- గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు

పంచాయతీరాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'క్యాష్' కొడితే గానీ క్వాలిటీ కంట్రోల్ రిపోర్ట్ ఇవ్వడం లేదని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల్లో ఒక శాతం, ఇతర లోపాలు ఏమైనా ఉంటే అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. కమీషన్లు ఇచ్చుకోలేక కాంట్రాక్టర్లు నలిగిపోతున్నారు.

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ పరంగా నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో ప్రతి డివిజన్‌కు ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ), ముగ్గురు లేదా నలుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ)లు ఉంటారు. వీరిని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) పర్యవేక్షిస్తారు. రోడ్డు గానీ, భవనాలు గానీ నిర్మించాక క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా పరిశీలిస్తారు. నిర్దేశిత నిష్పత్తి మేరకు సిమెంట్, ఇసుక తదితరాలు వాడారా లేదా చూసి రిపోర్ట్ ఇస్తారు. రూ.30 లక్షల్లోపు బిల్లులు అయితే డీఈఈ స్థాయి, అంతకన్నా ఎక్కువైతే ఈఈ స్థాయిలో క్యూసీ (క్వాలిటీ కంట్రోల్ రిపోర్ట్) రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని బట్టి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు ఉంటుంది.

యథేచ్ఛగా వసూళ్లు..

క్యూసీల మంజూరు మాటున కొందరు అధికారులు యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్డింగ్ లేదా రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేస్తే.. అందుకు ఒక శాతం అంటే రూ.40 వేలు కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనని సమాచారం. దీంతో కొందరు కాంట్రాక్టర్లు రిపోర్ట్ తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. 'క్యూసీ' సమర్పిస్తే ఎంత బిల్లు వస్తుందో అంతకంటే ఎక్కువ నష్టపోయినా పర్వాలేదంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



క్వాలిటీ కంట్రోల్ విభాగం కార్యాలయం

బరితెగించిన డీఈఈ..

కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీపై వచ్చిన ఓ డీఈఈ బరితెగించినట్లు తెలుస్తోంది. ప్రజా ప్రతినిధులతో పరిచయాలున్నాయని చెబుతూ అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టార్గెట్లు విధించి మరీ కమీషన్లు వసూలు చేసి ఇవ్వాలని కింది స్థాయి సహాయ ఇంజినీర్లను పట్టుబడుతున్నట్లు శాఖలో చర్చ జరుగుతోంది. మరి కొందరు ఉద్యోగులపైనా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలంటే వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు సకల సౌకర్యాలు కల్పించాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇక.. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో కొందరు ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది. పర్యవేక్షణ కరువవడంతోనే ఇలా తయారయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటా

అక్రమ వసూళ్ల విషయం నా దృష్టికి రాలేదు. కమీషన్ల కోసం వేధించే అధికారుల గురించి బాధిత కాంట్రాక్టర్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటా.

– మల్లికార్జున మూర్తి, ఈఈ

అన్న, కొడుకును చంపేందుకు కుట్ర!

- ఆస్తి కోసం సోదరుడి పన్నాగం
- రూ. 23 లక్షలకు సుపారీ
- భగ్నం చేసిన రాయదుర్గం పోలీసులు

రాయదుర్గం: ఆస్తిపై కన్నేసిన ఓ సోదరుడు తన సొంత అన్న, అతడి కుమారుడిని హత్య చేసేందుకు పన్నిన కుట్రను రాయదుర్గం పోలీసులు భగ్నం చేశారు. ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు.గురువారం రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో సీఐ జయనాయక్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాంపురం సమీపంలోని కేకే పుర గ్రామానికి చెందిన మురారి దామోదర్ గౌడ్, మధుసూదన్ గౌడ్‌లు అన్నదమ్ములు. వీరికి సుమారు రూ.12 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. వీటికి సంబంధించి సోదరుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. వారం క్రితం కూడా గ్రామంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో దామోదర్ గౌడ్‌ను మధుసూదన్ గౌడ్ కుమారుడు భార్గవ్ చెప్పుతో కొట్టాడు. దీంతో కసితో రగిలిపోయిన దామోదర్ గౌడ్.. తన అన్న, అతడి కుమారుడిని అంతమొందించాలని భావించాడు. ఇందుకు రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన మారుతిరెడ్డికి రూ.23 లక్షలకు సుపారీ ఇచ్చాడు. గురువారం పల్లేపల్లి గేటు సమీపాన రూ.3 లక్షల అడ్వాన్స్, ఇద్దరినీ హత్య చేసేందుకు మూడు వేట కొడవళ్లు అందజేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటికే అక్కడ కాపు కాసిన పోలీసులు.. దామోదర్ గౌడ్‌తో పాటు మారుతి రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసులు నమోదు చేసి కటకటాల వెనక్కి పంపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో ప్రణాళికబద్ధంగా ఆపరేషన్ నిర్వహించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. రూ.3 లక్షల నగదు, మూడు వేట కొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇటీవల మెచ్చిరి గ్రామంలో జరిగిన ఓ హత్య కేసులో మారుతిరెడ్డి నిందితుడిగా ఉన్నాడని, దీంతో దామోదర్ గౌడ్ అతణ్ని ఆశ్రయించాడని వెల్లడైందన్నారు. కాగా, హత్యల కుట్రను భగ్నం చేసిన సీఐ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ రవిబాబు అభినందించి రివార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

తలకు మించిన భారం.. తొలగించక తప్పదు!

అనంతపురం: 'గతంలో ఆప్కాస్ ద్వారా మీకు జీతాలు చెల్లించేవారు. ఇటీవల ఆ వ్యవస్థను రద్దు చేయడంతో నేరుగా వర్సిటీనే చెల్లించాల్సి వస్తోంది. దీంతో తలకు మించిన భారం అవుతోంది. ఈ క్రమంలోనే కొంత మందిని తొలగించక తప్పదు' అని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జేఎన్‌టీయూ(ఏ) రిజిస్ట్రార్ కృష్ణయ్య స్పష్టం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం జేఎన్‌టీయూ నూతన వీసీ సుదర్శనరావును సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ సమక్షంలోనే రిజిస్ట్రార్ కృష్ణయ్య అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. వర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలు సింహభాగం అటానమస్‌గా మారిపోతున్నాయన్నారు. దీంతో వర్సిటీకి ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపు కష్టతరంగా మారిందని చెప్పారు. కొంత మందిని తొలగించక తప్పదన్నారు. ఆసక్తి ఉన్న వారు అనంతపురం నుంచి కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లొచ్చని, అక్కడ క్వార్టర్స్ సౌకర్యం కూడా ఉందన్నారు. కొంత మంది ఒక సెక్షన్ నుంచి మరొక సెక్షన్‌కు మారిస్తేనే నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి ఫోన్ చేయించి సిఫార్సు చేస్తున్నారన్నారు. ఫింగర్‌ప్రింట్ పెట్టి విధులకు హాజరు కాకుండా వెళ్లిపోతున్నారని, అలాంటి వారిపై నిఘా ఉంచామన్నారు.ఇప్పటికే 9 మందిని తొలగించామని, భవిష్యత్తులో మరింత మందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మయూర వాహనంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి మహారుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో మూలవిరాట్‌ను ఊరేగింపుగా ప్రత్యేక వాహనం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల నడుమ మయూర వాహనంపై ఊరేగించారు.





చంద్రమౌళీశ్వరుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్‌లో) స్వామివారు

క్లుప్తంగా

మట్కా నిర్వాహకుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: స్థానిక పలు ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా బాపనపల్లికి చెందిన కొండమనాయుడు, తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్ నివాసి నాగల మణికంఠ, భగత్ సింగ్ నగర్‌కు చెందిన సుబ్బరాయుడు, చాకలి ఆదినారాయణ ఉన్నారు. వీరు గురువారం ఉదయం తాడిపత్రిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి రూ.30వేలు నగదు, పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలే చోరీ

రాయదుర్గం టౌన్: స్థానిక మారెమ్మ గుడి ప్రాంతంలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు... ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న మంజునాథ్ భార్య స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం ఇంటికి తాళం వేసి ఆటో అద్దెల కోసం మంజునాథ్, ఆయన భార్య ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లారు. మధ్యాహ్నం 1 గంటకు భోజనానికి ఇంటికి చేరుకున్న మంజునాథ్.. అప్పటికే ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. లోపల వస్తువులన్నీ చెల్లాచెదురు చేసి ఓ క్యారియర్‌లో దాచి ఉంచిన రూ.80 వేలను అపహరించి, ఇంటి వెనుక ఉన్న మరో తలుపు నుంచి దుండగులు ఉడాయించినట్లుగా గుర్తించాడు. బీరువాకు వేసిన తాళం తీసేందుకు విఫలయత్నం చేశారని, బీరువా తలుపు తెరుచుకోకపోవడంతో అందులో ఉంచిన బంగారు నగలు భద్రంగా ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారున 67వ జాతీయ రహదారిపై బొలెరో వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ జనార్దన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ జనార్దన్ బుధవారం రాత్రి గుత్తిలో సరుకు అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కొత్తపేట వద్దకు చేరుకోగానే గుత్తి వైపు వస్తున్న వేగంగా వస్తున్న లారీ ఎదురుగా ఢీకొంది.ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. అందులో ఇరుక్కొని డ్రైవర్ జనార్దన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతి కష్టంపై జనార్దన్‌ను స్థానికులు కాపాడి గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు.

యువకుడి బలవన్మరణం

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఎగ్గిడి లోకేష్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. గేదెల పోషణతో జీవనం సాగించే లోకేష్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కడుపు నొప్పి తీవ్రత తాళలేక స్థానిక బైపాస్ సమీపంలోని ఓ రేకుల షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దోపిడీకి పక్కా స్కెచ్

- శ్రమశక్తి సంఘాల ముసుగులో దోపిడీకి 'తమ్ముళ్ల' ఎత్తుగడ
- ఉపాధి మేట్లుగా 90 శాతం అనుయాయులే
- వారి చేతుల్లోనే హాజరు, కూలీల డిమాండ్

జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు	2.60 లక్షలు
నమోదైన కూలీల సంఖ్య	4.58 లక్షలు
2024-25లో పనిదినాల లక్ష్యం	1.15 కోట్లు
పూర్తయిన పనిదినాలు	1.04 కోట్లు
మొత్తం శ్రమశక్తి సంఘాలు	13,164


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉపాధి హామీ పథకంలో అక్రమాలు ఊపందుకున్నాయి. మస్టర్లలో దొంగపేర్లు రాసి సొమ్మంతా సొంత ఖాతాల్లో వేసుకునేలా టీడీపీ నాయకులు రంగం సిద్ధం చేశారు. కొత్తగా ఏర్పాటవుతున్న శ్రమశక్తి సంఘాల ముసుగులో దోపిడీకి పక్కాగా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ప్రతి 25 నుంచి 50 మంది కూలీలకు ఓ శ్రమశక్తి సంఘం ఏర్పాటు చొప్పున ఈ ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తికావొచ్చింది. మొత్తం ఏడు నియోజకవర్గాలోని 31 మండలాల్లో యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య 2.60 లక్షలు కాగా, వీటి పరిధిలో 4.58 లక్షల మంది కూలీలు నమోదయ్యారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా సుమారు 13,164 శ్రమశక్తి సంఘాలు ఏర్పాటయ్యాయి.

అనుయాయులకే పెద్దపీట

నిబంధనల మేరకు ప్రతి శ్రమశక్తి సంఘానికి ఓ మేట్‌ను నియమించారు. అయితే స్థానిక టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉపాధి కూలీల్లో సీనియార్టీకి తిలోదకాలు ఇచ్చి టీడీపీ నేతలు సూచించిన వారి అనుయాయులకే పెద్దపీట వేశారు. ఇలా ప్రతి గ్రామంలోనూ టీడీపీ నేతలు గుర్తించిన వారే క్షేత్ర సహాయకులు, మేట్లుగా చలామణి అవుతున్నారు. ఈ విధానంపై ఉపాధి కూలీల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరోక్షంగా టీడీపీ నేతలకు దోచిపెట్టేందుకే మేట్ల వ్యవస్థను కూటమి సర్కార్ అమల్లోకి తెచ్చిందని మండిపడుతున్నారు. మండుటెండలో శ్రమించే తమపై వీరి పెత్తనం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే విషయాన్ని బాహాటంగా ప్రశ్నిస్తే వేతనాల్లో కోత వేస్తారమే భయం కూడా కూలీలను వెంటాడుతోంది.

మేట్ల ముసుగులోనే అసలు దోపిడీ

మేట్లుగా ఎంపికైన వారు కూలీలను ఉపాధి పనులకు తీసుకెళ్లడం, వారి అవసరాల మేరకు ఆన్‌లైన్‌లో డిమాండ్ పెంచుకోవడం, హాజరు నమోదు, వేతనాలకు సిఫారసు చేయడం లాంటి పనులను పర్యవేక్షించాల్సి ఉంది. ఈ మొత్తం ప్రక్రియనే టీడీపీ నేతల అక్రమాలకు ఊతమైంది. మస్టర్లలో దొంగ పేర్లు చేర్చి ఉపాధి కూలీల సొమ్ము కాజేసేలా పక్కా ప్రణాళికను రచించి, ఆ మేరకు అడుగులు వేశారు. మేట్‌గా ఉన్న వారికి వారి పరిధిలోని ఒక్కొ కూలీపై రూ.1.50 చొప్పున చెల్లిస్తారు. ఈ లెక్కన జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న 4.58 లక్షల మంది కూలీలకు గాను రోజుకు రూ.6.87 లక్షలు మేట్ల ఖాతాలకు చేరుతోంది. 100 రోజులకు రూ.6.87 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రకంగా కూలీల శ్రమదోపిడీకి కూటమి సర్కార్ తెరలేపింది.

గతమంతా స్వర్ణయుగం

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఉపాధి కూలీల సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రికార్డు స్థాయిలో పనులు కల్పించారు. ఎస్‌ఐసీ సర్వర్ ద్వారా ప్రతి పనినీ పర్యవేక్షిస్తూ పైసా అవినీతికి తావు లేకుండా చర్యలు చేపట్టారు. శ్రమశక్తి సంఘాలతో కూలీల శ్రమదోపిడీని గుర్తించి వాటిని రద్దుచేశారు. ప్రతి పైసాను కష్టపడిన కూలీల ఖాతాకు చేర్చారు. ఫలితంగా అప్పటికే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సైతం స్వగ్రామాలకు చేరుకుని ఉపాధి పనులతో ఎంతో సంతోషంగా జీవించారు.

ఒక్కో సంఘానికి ఒక్కో మేట్

జిల్లాలో శ్రమశక్తి సంఘాల ఎంపిక దాదాపు పూర్తయింది. ఒక్కో సంఘానికి ఒక్కో మేట్‌ను నియమించాం. ఆ గ్రూపు పర్యవేక్షణ, హాజరు చూసే బాధ్యత మేట్‌పై ఉంటుంది. క్షేత్రసహాయకుడు, టెక్నికల్, ఏపీఓ, ఎంపీడీఓ పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడైన మేట్లు అవకతవకలకు పాల్పడితే సత్వరం తొలగిస్తాం.

– సలీమ్ బాషా, పీడీ, డ్వామా

లేగదూడ దవడకు శస్త్రచికిత్స


శస్త్రచికిత్స చేస్తున్న పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం బృందం

అనంతపురం అగ్రికల్చర్: మూగజీవాలకు పశుసంవర్ధకశాఖ ఏడీలు, డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్సలు చేస్తూ రైతుల మన్ననలు పొందుతున్నారు. తాజాగా విరిగిపోయిన లేగదూడ దవడకు శస్త్రచికిత్స చేశారు. వివరాలు.. గార్లదిన్నె మండలం తలకాసులపల్లి గ్రామం వడ్డే నరేష్‌కు చెందిన పాడి ఆవు మూడు రోజుల కింద కోడేదూడను ఈనింది. దూడ ఆరోగ్యంగా ఉన్నా కింది దవడ ఎముక విరిగిపోవడంతో వేలాడసాగింది. దవడ నొప్పి వల్ల పాలు తాగలేక రోజురోజుకూ నీరసిస్తున్న దూడను గమనించి స్థానిక పశువైద్యాధికారి శింగనమల పశువైద్యశాల ఏడీ డాక్టర్ జి.పద్మనాభానికి రెఫర్ చేశారు. దీంతో ఆటోలో అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న పశువైద్యశాలకు దూడను తీసుకువచ్చి తన బృందంతో డాక్టర్ పద్మనాభం శస్త్రచికిత్స చేశారు. దవడ ఎముకకు రెండు వైపులా 2.5 మి.మీ స్టెయిన్‌లెస్ స్టీల్ పిన్నులను అమర్చారు. శస్త్రచికిత్స తర్వాత దూడ దవడ సాధారణ స్థితికి చేరుకోవడం, పాలు తాగడం మొదలు పెట్టింది. దూడకు అవసరమైన ఫ్లూయిడ్స్, యాంటీబయాటిక్స్, అనాల్జిసిక్స్ లాంటి మందులు కూడా అందించినట్లు పద్మనాభం వెలిపారు. శస్త్రచికిత్సలో 1962 అంబులెన్స్ డాక్టర్ సునీత, ట్రైనీ డాక్టర్ నేహ, కమలాకార్, గీత పాల్గొన్నట్లు తెలిపారు.

పేరూరు డ్యాంకు నీళ్లివ్వాలి

- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు రూరల్: శ్రీశైలంలో కృష్ణ జలాలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో పేరూరు డ్యాంకు నీళ్లిచ్చేలా స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. త్వరలో హంద్రీ–నీవా కాలువకు నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు అధికారులు చెబుతున్న నేపథ్యంలో గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీశైలం డ్యాంలో 70 టీఎంసీల నీటి నిలువ ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు రోజూ అర టీఎంసీ చొప్పున నీటిని వినియోగిస్తున్నాయని, ఈ లెక్కన 140 రోజుల వరకు నీరు అందే అవకాశం ఉంటుందన్నారు. ఈలోపు పేరూరు డ్యాంకు నీళ్లు నింపేందుకు అన్ని అవకాశాలూ ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను పరిటాల సునీత కలిసినా పేరూరు డ్యాంకు నీళ్లు ఇవ్వాలని అడగక పోవడం బాధాకరమన్నారు.

అప్పట్లో వరుసగా మూడేళ్లు నింపాం

వైఎస్ జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంను నీటితో నింపినట్లు ప్రకాష్ రెడ్డి గుర్తు చేశారు. డ్యాంలో నీళ్ల లేకపోతే రాబోయే ఎండాకాలంలో నియోజకవర్గంలో వందలాది గ్రామాలు కనీసం తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటాయన్నారు. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేరూరు డ్యాంను నీటితో నింపడం ద్వారా రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో భూగర్భజలాలు పెరిగి, 10 వేల ఎకరాల్లో పంటల సాగు అందుబాటులోకి వస్తుందన్నారు. రొద్దం మండలం తురలాపట్నం వంకలో నీళ్లు వదిలితే నేరుగా డ్యాంకు చేరుకుంటాయన్నారు. దీనికి కరెంటు ఖర్చు తప్ప ఇతర ఖర్చులేమీ ఉండవన్నారు. ఇంత చిన్న అంశాన్ని పరిటాల సునీత ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

డిమాండ్ రాగానే గేట్లు తొలిగించారు

పేరూరు డ్యాంకు నీళ్ల ఇవ్వాలనే డిమాండ్ రైతుల నుంచి మొదలవగానే మరమ్మతుల పేరుతో ఉన్న గేట్లను తొలిగించడం దారుణమన్నారు. రైతులపై కక్ష తీర్చుకునేలా డ్యాంలో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా పరిటాల సునీత వైఖరి కారణంగా దిగువకు వృధాగా పారాయన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 40 టీఎంసీల నీటి ప్రవాహ సామర్థ్యంతో హంద్రీ–నీవా కాలువను తెచ్చారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ కాలువను 83 టీఎంసీల నీటి ప్రవాహ సామర్థ్యానికి పెంచారని గుర్తు చేశారు. పీఏబీఆర్ నుంచి రూ. 90 కోట్లతో మంచినీటి పైపులైను ఏర్పాటు చేశారన్నారు. జీడిపల్లి అప్పర్ పెన్నార్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.170 కోట్ల నిధులిచ్చారన్నారు. అయితే టీడీపీ హయాంలో చేసిందేమీలేదని, రూపాయి ఖర్చు లేకుండా నీళ్లిచ్చే అంశాన్ని సైతం ఎమ్మెల్యే సునీత నిర్లక్ష్యం చేస్తుండడం గమనిస్తే నియోజకవర్గ రైతులు, ప్రజల సంక్షేమం పట్టలేదనేది అర్థమవుతోందన్నారు.

బెణికల్లులో 'బెల్టు' చిచ్చు

- బెల్ట్ షాప్‌లో ఆదాయం తగ్గిందంటూ వ్యక్తిపై టీడీపీ నేత కుట్ర
- కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లుగా కేసు నమోదు చేయాలంటూ ఎక్సైజ్ అధికారులకు హుకుం
- వాస్తవాలు గుర్తించకుండా పట్టుకెళ్లిన ఎక్సైజ్ పోలీసులు
- గ్రామంలో ఇరువర్గాల ఘర్షణ.. ఏకపక్ష దాడులతో ఉద్రిక్తత

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో 'బెల్టు షాపు' చిచ్చును టీడీపీ నేతలు రాజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక 'వీధికోటి... సందుకోటి' చొప్పున బెల్టు షాపులు వెలిశాయి. తమ అనునూయులకు ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా కూటమి నేతలు గ్రామాల్లో బెల్టుషాపులు పెట్టించారు. ఈ నేపథ్యంలో 'బెల్టు షాపు' నిర్వహణ అంశంలో స్థానిక టీడీపీ నేత తీసుకెళ్లిన ఒత్తిడి ఆ గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది.

న్యాయ పోరాటానికి సిద్ధమైన బాధితుడు

కణేకల్లు మండలం బెణికల్లు గ్రామంలో టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ ఎర్రిస్వామి తమ పార్టీ కార్యకర్త జీవనోపాధి కోసం బెల్టుషాపు పెట్టించారు. గత పది రోజులుగా బెల్టు షాపు ద్వారా ఆశించిన మేర వ్యాపారం జరగలేదు. దీంతో ఆదాయం తగ్గింది. ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్త సదరు నేత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీపైడ్ లిక్కర్) అమ్మడం వల్లే బెల్టు షాపులో అమ్మకాలు తగ్గాయని, ఇందుకు కారకుడైన అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామిని అరెస్ట్ చేయాలంటూ ఎక్సైజ్ సీఐ ఉమాబాయిపై ఒత్తిళ్లు తీసుకెళ్లాడు. దీంతో బుధవారం సాయంత్రం తన సిబ్బందితో కలసి సీఐ వన్నూరుస్వామి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. అక్కడ ఎలాంటి మద్యం దొరకలేదు. ఇదే విషయాన్ని సదరు టీడీపీ నేతకు ఆమె ఫోన్ చేసి తెలిపారు. అయితే ఎలాగైనా వన్నూరుస్వామిపై కేసు బనాయించి గ్రామంలో బెల్టుషాపు సజావుగా జరిగేలా చూడాల్సిందేనంటూ ఆయన హుకుం జారీ చేయడంతో వన్నూరు స్వామిని స్టేషన్‌కు తరలించి చితకబాది కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు ఒప్పించేలా చేశారు. ఈ మొత్తం వ్యవహారం ఎందుకు చేయాల్సి వచ్చిందో కాసేపటి తర్వాత వన్నూరుస్వామి కుటుంబసభ్యులకు ఓ అధికారి తెలిపారు. దీంతో అదే రోజు రాత్రి గ్రామానికి చేరుకున్న వన్నూరుస్వామి కుటుంబ సభ్యులు నేరుగా ఎర్రిస్వామి ఇంటికెళ్లి తప్పుడు కేసు ఎందుకు పెట్టించావంటూ నిలదీశారు. తాను చెప్పినట్లు వినకపోతే ఏమైనా చేస్తామంటూ ఆ సమయంలో ఎర్రిస్వామి రెచ్చిపోవడమే కాక తన వర్గీయులతో దాడులకు తెగబడ్డాడు. అంతటితో ఆగకుండా తనపై వన్నూరుస్వామి, ఆయన తండ్రి మల్లికార్జున, తల్లి లింగమ్మ, కుటుంబసభ్యులు అనిత, భూలక్ష్మి, చిన్న వండ్రయ్య దాడి చేశారంటూ ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చావు దెబ్బలు తిన్న తల్లి లింగమ్మ ఫిర్యాదును ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఘటనపై వన్నూరు స్వామి మాట్లాడుతూ... తనను స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టి కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు అక్రమంగా కేసు నమోదు చేశారని, అంతేకాక తన కుటుంబసభ్యులపై దాడి చేసి చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై న్యాయపోరాటం సాగిస్తానని పేర్కొన్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి


లోకేష్ (ఫైల్)

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం నేమకల్లుకు చెందిన తలారి హనుమంతు, పార్వతి దంపతుల కుమారుడు లోకేష్ (35)కు ఏడేళ్ల క్రితం కల్లుహోళ గ్రామానికి చెందిన అంజలితో వివాహమైంది. వీరికి ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సొంతూరిలోనే ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న లోకేష్ బుధవారం వ్యక్తిగత పనిపై బొమ్మనహాళ్‌కు వచ్చాడు. పనిముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. నేమకల్లు చెక్ పోస్టు దాటగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో లోకేష్‌కు తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు తమిళనాడుకు చెందిన రాజుకూ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న రాజును కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. లోకేష్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. కాగా, బాధిత కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పరమేశ్వర పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

యువకుడిపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లికి చెందిన రామకృష్ణపై నలుగురు యువకులు దాడి చేసి గాయపరిచారు. వివరాలు.. రామకృష్ణ బుధవారం రాత్రి ఎంగిలిబండ వద్ద ఉన్న ధాబా వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడున్న తొండపాడు గ్రామానికి చెందిన నలుగురు యువకులు చిన్నపాటి అంశానికి రామకృష్ణతో గొడవ పడ్డారు. అక్కడున్న వారు సర్ది చెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. అయితే ఈ అంశంపై కక్ష పెంచుకున్న తొండపాడు గ్రామానికి చెందిన నలుగురు యువకులు బుధవారం అర్ధరాత్రి గొందిపల్లికి చేరుకుని రామకృష్ణ ఇంట్లోకి చొరబడి కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను కుటుంబసభ్యులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుడి సూచన మేరకు అనంతపురానికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

9న రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, సెక్రటరీ కిషోర్ రెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని రెడ్డి జన సంఘం కార్యాలయంలో జరిగే వేదికకు హాజరయ్యేవారు కాబోయే అబ్బాయిలు, అమ్మాయిల వివరాలు తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94415 75641, 93902 84296, 94907 67224 సంప్రదించాలని కోరారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు



హోంగార్డుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్

అనంతపురం: సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే వృత్తిలో రాణింపు సాధ్యమవుతుందని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ అన్నారు. అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గుర్తు చేసుకోవాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకుని ఉంటాయన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

అనంతపురం: డ్రైవింగ్ చేస్తూ అదుపు తప్పి కింద పడిన డ్రైవర్.. తన వాహనం చక్రాల కింద నలిగి దుర్మరణం పాలయ్యాడు. అనంతపురం నగరంలోని రద్దీగా ఉండే అశోక్ నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... నగరంలోని మరువకొమ్మ కాలనీలో నివాసముంటున్న ముత్యాలు (38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పనిలో భాగంగా ట్రాక్టర్‌ను డ్రైవింగ్ చేస్తూ అశోక్‌నగర్‌లోని హరిహర ఆలయం వద్దకు చేరుకోగానే ముత్యాలుకు మూర్ఛవచ్చింది. వాహన నియంత్రణ కోల్పోవడంతో పాటు అదుపు తప్పి కిందకు జారిపడ్డాడు. అదే సమయంలో ట్రాక్టర్ వెనుక చక్రాలు ఆయన మీదుగా దూసుకెళ్లాయి. ఘటనలో ముత్యాలు అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళుతున్న ట్రాక్టర్‌ను గమనించిన స్థానిక మెకానిక్‌లు వెంటనే స్పందించి చాకచక్యంగా బ్రేకులు వేసి, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, ముత్యాలు మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్వింటా చింతపండు రూ.31 వేలు


మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింతపండు ధర మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతోంది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 1,214.70 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.31 వేలు, కనిష్టంగా రూ.8,100, సగటున రూ.18 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ. 12 వేలు, కనిష్టంగా రూ.4,200, సగటున రూ. 6,500 ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

డీఎంఎల్‌టీలో స్టేట్ టాపర్‌గా కావ్య


కావ్యను అభినందిస్తున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ఇటీవల జరిగిన డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ పరీక్ష అనంతపురం వైద్యకళాశాలలోని పారామెడికల్ కోర్సు విద్యార్థిని కావ్య... రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఈ ఏడాది జనవరిలో జరిగిన పరీక్షల్లో 480 మార్కులకు గానూ 87.77 శాతంతో 416 మార్కులు సాధించింది. విద్యార్థిని ప్రతిభను గుర్తించిన మెడికల్ కళాశాల (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు గురువారం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థిని మంచి మార్కులు సాధించం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత పాల్గొన్నారు.


ప్రొబేషనరీ ఎస్ఐలతో ఎస్పీ జగదీష్

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

అనంతపురం: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ప్రొబేషనరీ ఎస్ఐల ఎస్పీ పి.జగదీష్ సూచించారు. జిల్లాకు కేటాయించిన 17 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు గురువారం డీపీఓలోని చాంబర్‌లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదులను అప్‌లోడ్ చేసే విధానం, డ్రోన్స్ ఉపయోగించడం, సీసీ కెమెరాలను ఉపయోగించే విధానం, కేసు డైరీ రాయడం, నేర స్థలంలో పరిశోధన తీరు, బందోబస్తు విధుల నిర్వహణ, పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రేపు జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఉట్ల పరుషను పురస్కరించుకుని అయ్యవారిపల్లి కాల్వ గోంచి వారి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఉదయం 8 గంటలకు దేశవు ఎద్దులచే జరుగుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన దేశవు ఎద్దులకు రూ.25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన దేశవు ఎద్దులకు రూ.10 వేలు బహుమతి అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 96524 11408, 9885082915 నంబర్లకు సంప్రదించాలన్నారు.

అనస్తీషియాలో వైష్ణవికి బంగారు పతకం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల ఖ్యాతి రాష్ట్ర స్థాయిలో ఇనుమడించింది. అనస్తీషియా విభాగానికి చెందిన పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్యార్థి డాక్టర్ వైష్ణవి.. పీజీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి గోల్డ్‌మెడల్‌కు ఎంపికైంది. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థిని డాక్టర్ వైష్ణవిని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల అనస్తీషియా వైద్యులు డాక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సరస్వతి పూజకు హాజరైన విద్యార్థులు

రాప్తాడు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఉపాధ్యాయులు, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని రాప్తాడు, గొందిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాంబశివుడు, నరేంద్రనాథ్ సూచించారు. గురువారం రాప్తాడు, గొందిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో సరస్వతి పూజ జరుపుకున్నారు. అనంతరం రాప్తాడు ఉన్నత పాఠశాలలో సరస్వతి, స్వామి వివేకానంద విగ్రహాలను ప్రతిష్ఠించారు.

సిండికేట్ నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతి చిత్రపటానికి పూజలు చేశారు. పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం దివాకర్‌రెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైన అట్ల, పెన్నులను నాగరాజు ఉచితంగా అందించారు. బాబు 20 కుర్చీలను పాఠశాలకు వితరణ చేశారు.

రమాదేవికి పదోన్నతి

అనంతపురం సిటీ: స్థానిక పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సి.బి.రమాదేవికి పదోన్నతి లభించింది. ఈమెకు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహమ్మద్ జహీర్ అస్లాం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయానికి రమాదేవిని బదిలీ చేసినట్లు అందులో పేర్కొన్నారు. గురువారం ఆమె అనంతపురంలో రిలీవ్ అయ్యారు.



భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట



వట్టిపోయిన కనగానపల్లి చెరువు

మరమ్మతులకు మోక్షమెప్పుడో?

- గత ఏడాది భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- బీళ్లుగా మారుతున్న ఆయకట్టు భూములు
- బీసీ కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు

కనగానపల్లి: పంటల సాగుకు నీరందించే చెరువు కట్ట తెగిపోవడంతో అన్నదాతలకు ఆధారం లేకుండా పోయింది. గత అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రం కనగానపల్లిలోని సాగునీటి చెరువు కట్ట తెగిపోయింది. తిరిగి అధికారులు చెరువు కట్ట మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానిక రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024, అక్టోబర్ 21వ తేదీ రాత్రి మండలంలో ఎప్పుడు కురవని విధంగా 198 మి.మీ. వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరడంతో గ్రామ సమీపంలోని చెరువు కట్ట తెగిపోయింది. దీనివల్ల ఆయకట్టు కింద సాగు చేసిన వరిమళ్లు, ఇతర పంటలు కొట్టుకుని పోయాయి. ఈ సంఘటన జరిగిన రెండవ రోజు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌తో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఇరిగేషన్ అధికారులు వచ్చి దెబ్బతిన్న పంటలతో పాటు తెగిన చెరువు కట్టను పరిశీలించి వెళ్లారు. పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారాన్ని ఇప్పించటంతో పాటు చెరువుకట్ట మరమ్మత్తు పనులు కూడా వెంటనే చేపడతామని చెప్పి చేతులు దులుపుకున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

కనగానపల్లి సాగునీటి చెరువు కట్ట తెగిపోయి ఇప్పటికి సుమారు 5 నెలలు అవుతున్నా అధికారులు ఇంతవరకూ పట్టించుకోలేదని రైతులు మండిపడుతున్నారు. కట్ట మధ్య భాగంలో తెగిపోవటంతో చెరువులో చుక్కనీరు కూడా నిల్వ లేకుండా పోయింది. ప్రస్తుతం హంద్రీ–నీవా కాలువ నుంచి చెరువులోకి నీరు వస్తున్నా ఆ నీరంతా నేరుగా బయటకు వెళ్లిపోతోంది. దీంతో ఆయకట్టు కింద ఉన్న భూముల్లో రబీలో పంటలు కూడా సాగు చేయలేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు చెరువులో నిల్వ లేకపోవటంతో చుట్టు పక్క ప్రాంతాల్లోని బోరుబావుల్లో కూడా నీరు అడుగంటి పోయాయి. దీనివల్ల పంటల సాగుకు ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే 500 ఎకరాల సాగు భూములు బీళ్లుగా మారే అవకాశం ఉందని స్థానిక రైతులు పోతలయ్య, నారాయణ, రాముడు, ముత్యాలమ్మ చెబుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

కనగానపల్లి బీసీ కాలనీ–1 చెరువు కట్టకు ఎగువ భాగంలో ఉంది. స్థానిక కాలనీవాసులు చుట్టు పక్కల ఉన్న వారి పొలాల్లోకి వెళ్లాలన్నా, ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారిలోకి వెళ్లాలన్నా ఈ కట్ట మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చెరువు కట్ట తెగిపోవడంతో 50 కుటుంబాలు పైగా ఉన్న ఈ కాలనీవాసులంతా ప్రస్తుతం కి.మీ. పైగా అదనంగా నడిచి పొలాల దగ్గరకు వెళ్తున్నారు. దీంతో పాటు పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు, వ్యాపారులు చెరువు కట్ట కింద ముళ్లకంపల్లో దూరి ప్రధాన రహదారిలోకి వెళ్తున్నారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



మా కాలనీ నుంచి వ్యవసాయ పొలాల దగ్గరకు వెళ్లాలంటే చెరువు కట్ట మీదుగానే వెళ్లే వాళ్లం. ప్రస్తుతం చెరువు కట్ట తెగిపోవటంతో కి.మీ దూరం పాటు అదనంగా నడిచి ముళ్ల కంపల్లో దూరి పొలాల దగ్గరకు వెళ్తున్నాం. సమీపంలోని ప్రధాన రహదారిలోకి వాహనాల్లో వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది.

– పోతలయ్య, బీసీ కాలనీ–1, కనగానపల్లి

నీరు వృథాగా పోయింది



కనగానపల్లి చెరువు కట్ట తెగిపోయి చుక్కనీరు నిల్వ ఉండకుండా పోయింది. దీంతో ఆయకట్టు కింద ఉన్న వంద ఎకరాల భూములతో పాటు, చుట్టు పక్కల ఉన్న బోరుబావుల కింద ఉన్న 400 ఎకరాల భూములకు కూడా సాగునీరు అందడం లేదు. దీంతో ప్రస్తుతం ఈ భూములన్నీ బీళ్లుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలి

– అంకె పురుషోత్తం, బీసీ కాలనీ–1, కనగానపల్లి

రాకపోకలకు అవస్థలు



మా కాలనీ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగా వెళ్లే వాళ్లం. ప్రస్తుతం చెరువు కట్ట తెగిపోవడంతో బడులకు వెళ్లే పిల్లలతో పాటు రోజు పట్టణాలకు వెళ్లే వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. చెరువుకట్ట ఉన్న ముళ్ల కంపల్లో దూరి ధర్మవరం రహదారిలోకి వెళ్తున్నాం. కట్ట పనులు త్వరగా పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

– రాయమ్మ, బీసీ కాలనీ–1, కనగానపల్లి

నివేదికలు పంపాం

భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట మరమ్మతు పనుల కోసం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కాని ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు విడుదల కాలేదు. నిధులు వచ్చిన వెంటనే చెరువు కట్ట మరమ్మతులు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, కనగానపల్లి మండలం

ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల కన్నెర్ర



ఇందిరమ్మకాలనీలో గుడి స్థలంలో నాటిన బండలను తొలగిస్తున్న అధికారులు



జేసీబీ వాహనంతో చదును చేస్తున్న దృశ్యం

- వంకస్థలం, ఓపెన్ స్థలాలను కాపాడిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు
- ఉదయం నుంచి సాయంత్రం దాకా దగ్గరుండి బండల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని సర్వే నంబర్లు 89, 83–11, 12లోని ఆక్రమణలపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెర్ర చేశారు. కబ్జాకు గురైన స్థలాలను కాపాడారు. తొలిరోజు హెచ్చరించి వెళ్లిన అధికారులు.. రెండో రోజు రంగంలోకి దిగి కట్ట ఖాళీ చేయించారు. తడకలేరు వంకను కబ్జా చేసి ఇళ్ల స్థలాల కోసం బండలు నాటడం, ఇందిరమ్మ కాలనీలో గుడికోసం వదిలిన ఓపెన్ స్థలాన్ని కబ్జా చేసి బండలు నాటిన వైనంపై 'సాక్షి'లో 'అధికారం మాదే.. అడిగే వారెవరు?' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు రంగంలోకి దిగారు. తొలిరోజు తహసీల్దార్ మోహన్ కుమార్ క్షేత్రస్థాయిలో ఆక్రమణలను పరిశీలించారు. కబ్జాదారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. మూడు రోజులు గడువు ఇచ్చారు. ఏమి జరిగిందో ఏమో రెండో రోజు గురువారం రంగంలోకి దిగారు. తహసీల్దార్, ఎంపీడీఓ ఆదేశాల మేరకు ఆర్ఐ సందీప్‌కుమార్, వీఆర్ఓలు రామకృష్ణ, సాయికిరణ్, పంచాయతీ కార్యదర్శి చరణ్, విలేజ్ సర్వేయర్ అశోక్, పోలీస్ కానిస్టేబుల్ దేవేంద్ర ఉదయాన్నే ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. జేసీబీ వాహనాన్ని తీసుకొచ్చారు. ముందుగా తడకలేరు వంకలో వేసుకున్న బండలన్నీ తొలగించేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత ఇందిరమ్మ కాలనీలో ఓపెన్ స్థలం వద్దకు చేరుకున్నారు. ఆక్రమణదారులంతా దగ్గరుండి బండలు తొలగించుకున్నారు. ఆ తర్వాత జేసీబీతో స్థలాన్ని చదును చేయించి సర్వే చేసి హద్దులు నాటారు. రెండు మూడు రోజుల్లో చుట్టూ కంచె వేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

వసూళ్ల రాయుళ్లపై ఒత్తిళ్లు

అయితే ఇక్కడ కొందరు పేదల నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లు చేసి నకిలీ పట్టాలు సృష్టించి వారికి ఇచ్చినట్లు తెలిసింది. ఆక్రమణలను అధికారులు బలవంతంగా తొలగించి కంచె వేయడంతో తాము చెల్లించిన డబ్బులు తిరిగి వెనక్కు ఇవ్వాలంటూ వసూళ్ల రాయుళ్లపై పేదలు ఒత్తిడి చేస్తున్నారు. అప్పనంగా వచ్చిన సొమ్మును కొందరు ఆక్రమణదారులు ఇప్పటికే ఖర్చు చేయడంతో వెనక్కు ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. కొంత గడువు కావాలని అడుగుతున్నా.. డబ్బు ఇచ్చిన వారు మాత్రం వెంటనే వెనక్కు ఇవ్వాలని లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ హెచ్చరించిట్లు సమాచారం.

ముగిసిన వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం





ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు చేతుల మీదుగా పట్టాలు అందుకుంటున్న వైద్య విద్యార్థులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల 2కె19 వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా ముగిసింది. బుధవారం అర్ధరాత్రి వరకు జరిగిన స్నాతకోత్సవంలో వైద్య విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. కాగా తల్లిదండ్రులు, తమ గురువుల సమక్షంలో పట్టాలు తీసుకోవడంతో వైద్య విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఫార్మర్ రిజిస్ట్రీపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న డివిజన్ ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించే ఫార్మర్ రిజిస్ట్రీ, అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుపై దృష్టి సారించాలి. గడువులోపు లక్ష్యాలు పూర్తి చేయాలని ఆత్మ పీడీ ఎంసీ మద్దిలేటి, డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. గురువారం స్థానిక కృషి భవన్‌లో అనంతపురం సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ఏఓలు, ఏఈఓలు, ఆర్ఎస్‌కే సిబ్బంది, ఎంపీఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక సమస్య కారణంగా ఇప్పటి వరకూ ఫార్మర్ రిజిస్ట్రీలో డివిజన్ పరిధిలోని మండలాలు వెనుకబడ్డాయన్నారు. ఇప్పటి నుంచి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇక యాంత్రీకరణకు సంబంధించి యాప్ అందుబాటులోకి వచ్చినందున ఆసక్తి అర్హత కలిగిన రైతులకు వివిధ రకాల స్ప్రేయర్లు, రోటావీటర్లు, పవర్‌వీడర్లు తదితర యంత్ర సామగ్రి 50 శాతం రాయితీతో అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. అలాగే రానున్న ఖరీఫ్‌కు సంబంధించి విత్తన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఏఓలు జే.శశికళ, శ్యాంసుందరరెడ్డి, సోమశేఖర్, సుచరిత, విజయకుమార్, డీఆర్‌సీ ఏడీఏ శైలకుమారి, ఏవోలు రుమానాబేగం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: షిర్డీ సాయిబాబా మత సామరస్యానికి ప్రతీక అని మేయర్ వసీం అన్నారు. స్థానిక కోవూరు నగర్‌లో షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా సందడిగా సాగిన ప్రత్యేక హోమాలు, పూజలు పూర్ణాహుతితో ముగిశాయి. మేయర్ వసీం ముఖ్య అతిథిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విశేషంగా అలంకార సేవలో దర్శనమిచ్చిన షిర్డీ సాయిబాబాను వందలాది మంది దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, కాకర్ల శీనా, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కేశవయ్య, కమిటీ సభ్యులు కుమార్, భాస్కర నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య



విజయలక్ష్మి (ఫైల్)

అనంతపురం: నగరంలోని 6వ సచివాలయం ప్లానింగ్ సెక్రెటరీగా పని చేస్తున్న విజయలక్ష్మి గురువారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు.. గతంలో ఓ మండల కేంద్రంలో విజయలక్ష్మి హౌసింగ్ కాంట్రాక్టు ఏఈగా, నరేంద్ర వర్క్ఇన్‌స్పెక్టర్‌గా కలిసి పని చేస్తుండేవారు. ఇద్దరూ ఒకే చోట పని చేస్తుండటంతో స్నేహం ప్రేమగా మారింది. అనంతరం ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. విజయలక్ష్మి ప్లానింగ్ సెక్రెటరీగా, నరేంద్ర నార్పలలో విలేజ్ సర్వేయర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని నరేంద్రను విజయలక్ష్మి కోరింది. మా చెల్లి పెళ్లి అయిపోయాక పెళ్లి చేసుకుంటానని నరేంద్ర తెలిపాడు. ఈ నెల 1వ తేదీన నరేంద్ర చెల్లెలు పెళ్లి అయిపోయింది. దీంతో తిరిగి పెళ్లి ప్రస్తావన వచ్చింది. తరచూ పెళ్లి వాయిదా వేస్తుండటంతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి రామచంద్ర నగర్‌లోని తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. నరేంద్రపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలపై దుష్ప్రచారం తగదు

అనంతపురం ఎడ్యుకేషన్: కొంతమంది కుల సంఘాల పేరుతో తమ స్కూలుపై బురదజల్లుతున్నారని ఎడిఫై స్కూల్ ప్రిన్సిపాల్ కామేశ్వరి మండిపడ్డారు. గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్కూల్‌లో బాత్రూంలలో పిల్లలతో పరీక్షలు రాయిస్తున్నారంటూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కుల సంఘాల నాయకులు మాట్లాడిన మాటలు పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేశారు. నిజాలు తెలుసుకోకుండా మీడియాలో వార్తలు రావడం దురదృష్టకరమని తెలిపారు. వార్తలు రాసేముందు వివరణ తీసుకోవాలని సూచించారు.

పోలీస్ స్టేషన్లలో 'ఓపెన్ హౌస్'

అనంతపురం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పోలీసులు దైనందిన విధులపై ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్లను సందర్శించిన విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వర్తించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నూతన చట్టాలు, బాల్య వివాహాలు, పోలీస్ హెల్ప్‌లైన్, డయల్ 100/112, ఉమెన్స్ సేఫ్టీ యాప్స్‌పై వివరించారు.

చికిత్స పొందుతూ యరగుంట వాసి మృతి

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కణేకల్లు మండలం యరగుంట గ్రామానికి చెందిన వడ్డే తిమ్మయ్య (54) గురువారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్డే తిమ్మయ్య ప్రస్తుతం నందమూరి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బళ్లారి రోడ్డు ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. బుధవారం రెండో అంతస్తులో క్యూరింగ్ కోసం నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ తిమ్మయ్యను సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టెక్నాలజీపై అవగాహన

అనంతపురం: విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సైబర్ సీఐ షేక్ జాకీర్ సూచించారు. గురువారం పోలీసులు వినియోగిస్తున్న టెక్నాలజీపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డ్రోన్స్, సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్ఎంఎస్, డయల్–100/112, వివిధ సైబర్ నేరాలపై వివరించారు.

అయ్యవారిపల్లిలో జాతర ప్రారంభం

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత జాతర గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో తొలిరోజు కాపులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కాల్వగొంచి వారు ఇంటి నుంచి నైవేద్యం తలపై పెట్టుకుని తెచ్చి పూజలు చేపట్టారు. ఆలయ సమీపంలోని వినాయకుడు, రాముడు, గోటుకూరప్ప స్వాములను అలంకరించారు. ఉదయం స్వామికి అయ్యవారిపల్లి కాల్వగోంచివారు ప్రత్యేక పూజలు చేసి, సమారాధన చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటలకు వరకూ అన్నదానం చేశారు.

అద్దెకు మొబైల్ కూరగాయల వాహనం

అనంతపురం అగ్రికల్చర్: రైతుబజార్‌లో ఉన్న మొబైల్ కూరగాయల వాహనం నెలవారీ అద్దెకు ఇవ్వనున్నట్లు ఎస్టేట్ అధికారి ప్రతాప్‌రుద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు నెలవారీ అద్దె ప్రాతిపదికన మొబైల్ ఆటోను తీసుకుని నగరంలో ఎక్కడైనా కూరగాయలు, పండ్లు, పూలు లాంటివి అమ్ముకోవచ్చన్నారు. కావాల్సిన వారు స్థానిక రైతు బజార్‌లో సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీని టెట్ కమ్ టీఆర్టీ పద్ధతిలో నిర్వహించాలని రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్పీఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు, ఆర్ఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆర్.నారాయణ నాయక్ మాట్లాడారు. ఇటీవల జరిగిన టెట్ పరీక్షల్లో గణితం, బయాలజీ లాంటి వివిధ సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం కూడా ఉత్తీర్ణత రాలేదన్నారు. టెట్ కమ్ టీఆర్టీ పద్ధతిలో డీఎస్సీ పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఆర్ఈఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ జి నాగభూషణం, రాష్ట్ర కో–కన్వీనర్లు మావిటి శ్రీరాములు, బి.రాజశేఖర్, మర్రిస్వామి, ఆర్.మల్లికార్జున, శివ రుద్రయ్య గౌడ్, కృష్ణ, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వరప్రసాద్, ఆర్ఈఎఫ్ నాయకులు ఏ.నాగభూషణం, ఆదినారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

రాప్తాడు రూరల్: ప్రజా సమస్యలపై సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర సమితి కార్యదర్శి ఎన్.శ్రీరాములు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున, నగర సహాయ కార్యదర్శులు బి. రమణయ్య, కె.అల్లిపీరా, నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఎల్లుట్ల నారాయణస్వామి, చాంద్ బాషా, గాదిలింగప్ప, మున్నా, సూర్యనారాయణ, ఖాజా హుస్సేన్, టీవీ టవర్ శ్రీనివాసులు, వరలక్ష్మి, జయలక్ష్మి, పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్: అనంత మహిళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న లలిత కళాపరిషత్తులో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వేదిక నాయకురాళ్లు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్కేపీలో జి.పద్మజ, డాక్టర్ హేమలత, సావిత్రి, లత తదితరులు విలేకరులతో మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, జిల్లా ఎస్పీ జగదీష్‌తో పాటూ పలువురు అధికారులు పాల్గొంటారన్నారు. అతిథిగా మహిళా సామాజిక వేత్త దేవి ప్రధాన వక్తగా విచ్చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన మాధవరాజు (మూగవాడు) ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాధవరాజు తన ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం అనంతపురం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా రాప్తాడు సమీపంలో 44వ జాతీయ రహదారి వండమేరు వంక బ్రిడ్జిపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొనడంతో మాధవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సబ్సిడీపై కోళ్ల పంపిణీ

ఆత్మకూరు: స్థానిక వెలుగు కార్యాలయం వద్ద గురువారం అర్హులైన లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం పద్మావతి మాట్లాడుతూ.. కోళ్ల పెంపకంలో భాగంగా ఎస్టీ కుటుంబాలకు 55 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో యూనిట్‌లో 11 పెట్ట కోళ్లు, 5 పుంజు కోళ్లు, 30 కిలోల దాణా సబ్సిడీపై అందజేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.